**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666
Homepage: https://www.ijar.org.in/
Volume-12, Issue-1, Jan-Mar-2025
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# ఆముక్త మాల్యద – ప్రబంధ లక్షణాలు – సమన్వయం

డా॥ ఎల్లే విజయానందరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు. సెల్ : 94410 88634

---

**అ) కవి పరిచయం :**

శ్రీ కృష్ణదేవరాయలు తుళువ వంశానికి చెందిన నరసనాయకుడు, నాగలాంబకు జన్మించారు. వీరు తెలుగు ప్రబంధకవిగా, సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా, ఆంధ్ర భోజునిగా కీర్తి గడించారు. రాయల వారికి తిరుమలదేవి, చిన్నాదేవి ఇద్దరు భార్యలు. అయితే అన్నపూర్ణదేవి (తుక్కాదేవి)ని కూడా వివాహం చేసుకున్నట్లు కొన్ని ఆధారాలున్నాయి. తిమ్మరుసు వీరి ప్రధానమంత్రి. శ్రీకృష్ణ దేవరాయలు తిమ్మరుసును పితృ సమానులుగా గౌరవించి "అప్పాజీ" (తండ్రిగారు) అని పిలిచేవాడు. క్రీ.శ. 1509లో రాజ్య పాలకుడై క్రీ.శ. 1530 దాకా విజయనగర సామ్రాజ్యాన్ని రాయలు వైభవోపేతంగా పరిపాలించాడు.

శ్రీ కృష్ణదేవరాయలు స్వయంగా కవికావడంతో సంస్కృతంలో **జాంబవతీ కళ్యాణము, మదాలసా చరిత్ర, సత్యవధూ ప్రీణనము, సకల కథాసార సంగ్రహము, జ్ఞాన చింతామణి, రసమంజరి** తదితర గ్రంథాలను, తెలుగులో **ఆముక్తమాల్యదను** రచించాడు.

రాయలవారు భువన విజయం అనే సాహిత్య సభా భవనాన్ని నిర్మించి, అష్టదిగ్గజ కవులను పోషించారు. భువన విజయంలో (1) అల్లసాని పెద్దన (మనుచరిత్ర), (2) నంది తిమ్మన (పారిజాతాపహరణము), (3) రామరాజ భూషణుడు (వసుచరిత్ర), (4) ధూర్జటి (శ్రీ కాళహస్తి మహాత్మ్యము) (5) తెనాలి రామకృష్ణుడు (పాండురంగ మహాత్మ్యము), (6) అయ్యల రాజు రామభద్రుడు (రామాభ్యుదయము), (7) మాదయ గారి మల్లన (రాజశేఖర చరిత్రము), (8) పింగళి సూరన (కళాపూర్ణోదయము), మొదలగు ఎనిమిది మంది కవులుండేవారు.

**ఆ) కావ్య పరిచయము :**

శ్రీ కృష్ణదేవరాయలు విజయవాడ యాత్రకు వచ్చి, విడిది చేసినప్పుడు శ్రీకాకుళాంధ్ర విష్ణువు ఆయన కలలో కనబడి తనపై తెలుగులో కావ్యం రాయమని ప్రోత్సహించగా భగవంతుని ఆదేశంతో రాయబడిన కావ్యమే ఈ ఆముక్తమాల్యద.

ఆముక్తమాల్యద అనగా

'ఆముక్త' – అలంకరించుకోబడిన

'మాల్య' – పూల దండ

'ద' – ఇచ్చింది.

భక్తురాలు తాను ధరించిన పూలదండను తరువాత భగవంతుని మెడలో వేసిన సందర్భంలోనిదీ కథ. భక్తి ఎంత స్వచ్ఛమైనదో, అమాయకమైనదో చెప్పే అందమైన కథ ఆముక్తమాల్యద.

ఆముక్తమాల్యద రచనకే 'విష్ణుచిత్తీయం' అనే మరో పేరు కలదు. ఇది తెలుగు పంచకావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధిచెందింది. ఏడు ఆశ్వాసాల ఈ కావ్యంలో ఐదు ప్రధాన కథలున్నాయి. (1) విష్ణుచిత్తుని కథ (2) యామునాచార్యునికథ (3) ఖాండిక్యకేశి ధ్వజల సంవాదం (4) గోదాదేవి కథ (5) మాలదాసరి కథ.

ఈ కావ్యంలో విష్ణుచిత్తుడు అనే భక్తుడు శ్రీ విల్లిపుత్తూరులో మన్నారుస్వామి దేవాలయంలో అర్చకుడిగా జీవిస్తుంటాడు. ఆయనకు ఒకరోజు తులసివనంలో స్త్రీ శిశువు దొరుకుతుంది. సంతానంలేని విష్ణుచిత్తునకు విష్ణువే కరుణించి తనకు శిశువును ప్రసాదించాడని భావించి ఆమెకు గోదాదేవి అను పేరు పెట్టి పెంచుకోసాగాడు. గోదాదేవి తన తండ్రి దేవుని కోసం అల్లిన పూలమాలను చాటుగా ధరించి, తన నీడను చూచుకొని ఆనందించి తిరిగి ఆ మాలను యథా స్థానంలో పెట్టేది. ఆ మాలనే విష్ణుచిత్తుడు స్వామికి అర్పించేవాడు. ఆ కారణంగా గోదాదేవకి ఆముక్తమాల్యద అనే పేరు వచ్చింది.

**ఇ) ప్రబంధ పరిచయం :**

**ప్రబధ్యతే ఇతి ప్రబంధః** అనగా ప్రకృష్ణమైన బంధం కలది అని అర్థం. ప్రబంధం అంటే 'ప్ర' – చక్కగా 'బంధం' – కూర్చబడినది. ఏదైనా ఒక కావ్యం రచించే పద్ధతిలో కథనానికి ప్రాధాన్యం ఇస్తూనే సందర్భోచితమైన చక్కని వర్ణన చేస్తే అది ప్రబంధం అవుతుంది. అనగా పురాణ, ఇతిహాసముల నుండి ఏదైనా చిన్న కథ తీసుకోవడం, దానిని వర్ణనలతో పెంచి స్వతంత్ర కావ్యంగా రచించిన దానిని ప్రబంధం అంటారు.

తిక్కన తాను రాసిన 15 పర్వాలను 'ప్రబంద మండలి' అని పేర్కొనగా, ఎర్రన తాను 'ప్రబంధ పరమేశ్వరుడి'గా కీర్తిగడించాడు. అయితే ఈ ప్రబంధ శబ్దానికి, ప్రక్రియ పరమైన ప్రబంధ శబ్దానికి ఎంతో భేదం ఉంది. అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' నుండి పింగళి సూరన కళాపూర్ణోదయం వరకు ఉన్న కాలాన్ని ప్రబంధ యుగంగా సాహితీకారులు పేర్కొంటారు.

**ఈ) ప్రబంధ లక్షణాలు :**

(1) పురాణేతిహాసాల నుండి కథకు గ్రహించాలి.

(2) ఏక నాయకుడుండాలి

(3) వస్త్వైక్యం ఉండాలి

(4) అష్టాదశ వర్ణనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

(5) శృంగార రసానికి ప్రాధాన్యం ఇవ్వాలి

(6) ఆలంకారికమైన శైలి ఉండాలి

(7) సజీవ పాత్రచిత్రణ ఉండాలి

(8) అనువాదం కాక, స్వతంత్ర రచన అన్నట్లు ఉండాలి.

**ఆముక్తమాల్యద – కథాంశాలు – సమన్వయం**

ప్రబంధ కావ్యాలు కేవలం కథ చెప్పటంకోసం రచింపబడినవి కావు. ప్రబంధం అంటే అష్టాదశ వర్ణనల సముదాయం, ఋతువర్ణన, పురవర్ణన, రాజనీతి ఇత్యాది ఎన్నో వర్ణనలను కథ మాటున చెప్పటానికి ప్రబంధాలను రచించారు. ఆముక్తమాల్యదలో ఋతువర్ణన అందులోనూ వర్ష ఋతువర్ణనకు తెలుగులో మరే కావ్యమూ సాటిరాదు.

1) ప్రథమాశ్వాసంలో శ్రీ విల్లిపుత్తూరు వర్ణనతో ప్రారంభించి, వివిధ వర్ణాల వారిని వర్ణించాక విష్ణుచిత్తుని గృహజీవనాన్ని వర్ణించారు. శ్రీ విల్లి పుత్తూరులోని ప్రకృతిని వర్ణించటంలో రాయలు విశేష ప్రజ్ఞ కనబరచారు.

తలబక్షట గ్రుచ్చి బాతువులు కేదారంపు కుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకులు సుస్నాత ప్రయాతద్విజా
వలి పిండీకృత శాటులల్లని దదావాసంబు జేర్పంగ రే
వుల డిగ్గన్వెసఁబాఱుఁవానిఁగని నవ్వున్మాలిగోప్యాఘముల్!" అనే వర్ణన రాయల భావనా శక్తికి జయపతాకవంటి ప్రతీక!

2) ద్వితీయాశ్వాసంలో మధురానగరంను వర్ణించిన తర్వాత ఆ రాజ్యాధిపతి మత్స్యధ్వజుణ్ణి వర్ణించాడు. తరువాత వేసవి కాలాన్ని వర్ణించాడు. మత్స్యధ్వజుడు వెలయాలి ఇంటికి పోతున్నపుడు, అరుగు మీద పడుకొన్న పరదేశి విప్రుడు చదివిన శ్లోకాన్ని అతడు విని వైరాగ్య భావానికి లోనవుతాడు. తనకు ముక్తి మార్గం ఉపదేశించిన వారికి ధనమిస్తానని ఆయన ప్రకటిస్తాడు.

3) తృతీయాశ్వాసంలో విష్ణుచిత్తుడు రాజసభలో ప్రవేశించిన పర మతాలను ఖండించి స్వమతాన్ని స్థాపిస్తాడు. తరువాత రాజుగారికి ఆయన ఖాండిత్య కేశిధ్వజుల కథ విన్పిస్తాడు. ఖాండిత్య కేశిధ్వజుడు భౌతిక రాజ్యం కోసం యుద్ధం చేసి, ఆధ్యాత్మిక జ్ఞానం కోసం కలుసుకుంటారు.

4) చతుర్థాశ్వాసంలో విష్ణుచిత్తుడు శ్రీవిల్లిపుత్తూరు బయలుదేరతాడు. అప్పుడు భగవంతుడాయనకు సాక్షాత్కరిస్తాడు. తరువాత కవి యమూనాచార్యుల వారి వృత్తాంతాన్ని వర్ణించాడు.

5) పంచమాశ్వాసంలో విష్ణుచిత్తునికి గోదాదేవి తులసి తోటలో దొరకటం, ఆమె బాల్య, యౌవన విలాసాలను, విష్ణుభక్తి తత్పరతను, తాను ధరించి చూచుకొన్న తర్వాత పూలమాలికను దేవునికి అర్పించటం అనే విషయాలున్నాయి.

6) షష్ఠాశ్వాసంలో మాలదాసరి కథ ఉన్నది. మాలదాసరి బ్రహ్మరాక్షసుని పాలబడి నేను గుడిముందు గానం చేసి వచ్చాక తిను అంటాడు. బ్రహ్మరాక్షసుడు మొదట ఒప్పుకోకపోయినా, చివరకు సమ్మతించి, దాసరి సత్యసంధతకు ఆశ్చర్యపోతాడు. మంగళ కైసికీ గానఫలం తనకు ధారపోసి తన రాక్షసత్వం తొలగించమని రాక్షసుడు దాసరిని వేడుకొంటాడు. దాసరి అంగీకరిస్తాడు.

7) సప్తమాశ్వాసంలో రాక్షసుడు తన వృత్తాంతం చెప్తాడు. గోదాదేవి శ్రీరంగనాయకులను సేవించటం అతనిలో ఐక్యం కావటం, దేవుడు మాయా వధూటిని ఆమె స్థానంలో నిలపటం, విష్ణుచిత్తుడు కూతురు కనపడక విలపిస్తే దేవుడు ఓదార్చటం పెళ్ళిమాటలు, గోదాదేవి రంగనాథుల వివాహం ఈ ఆశ్వాసంలో వస్తాయి.

ఆముక్తమాల్యదలో రాయల లోకోత్తరమైన వర్ణనా చాతుర్యం వర్షాకాలాదుల, ఇంకా ఋతువర్ణనల్లో నైపుణ్యం ఆశ్చర్యం కల్గిస్తాయి. ప్రకృతి వర్ణనలలో రాయలకు సాటి వచ్చే తెలుగు కవి లేడు. రాజనీతి వర్ణనల్లో మహాభారతము కంటే భిన్నమైన నీతులు చెప్పటమే గాక, వాటిని ఆయన ఆచరించి చూపాడనుకోవచ్చు.

సాధారణ గృహస్థుల కష్టసుఖాలను వర్ణించటంలో రాయలు అమోఘ ప్రజ్ఞ కనపరిచాడు. వర్షఋతువులో పొయ్యి మండక ఇల్లాండ్రు పడే అవస్థను, ఇంట్లోనే పశువులను కట్టివేసుకోవలసిన రైతుల అగచాట్లును, చేపలను నూనెతో తాలింపు వేసుకొని భుజించి త్రేన్చినప్పటి సౌఖ్యాన్ని ఆ కసరు పోవటానికి లేత కొబ్బరి బోండాల నీటిని సేవించిన వైనాన్ని రాయలు రమణీయంగా తెలిపాడు. రవి గానని చోట కవి కాంచుకునే సూక్తిని సార్థకం చేసినట్లు రాయలు సూక్ష్మ పరిశీలనా శక్తి ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది.

**Citation:** Y. Vijayananda Raju 2025. "Aamuktya Malyadha - Prabanda Lakshanaalu - Samanyaym". International Journal of Academic Research, 12(1): 37-40.
**Copyright:** ©2025 Y. Vijayananda Raju. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.